మార్కెట్టు అంత దూరముందనగానే అక్కడ జనం గుంపులు గుంపులుగా పోగవడం గమనించాను.

ఆదివారం గవర్నమెంటు ఆఫీసుల దగ్గర్నుంచి చిన్న చిన్న షాపుల వరకు కూడా సెలవు కావటాన సాధారణంగా ఆ రోజు జనమంతా రోడ్లపైనే ఉంటారు. మార్నింగ్ షో సినిమాలకు పోయేవారు కొందరైతే, నానా మార్కెటింగ్ చేసేవాళ్ళు, అది ఇది లేక ఊరికినే రోడ్ల సర్వే చేసేవాళ్ళు మరి కొందరు.

మార్కెట్టు కెళ్ళి కూరలు తేవడమంటే నాకు బలే చిరాకు. ఈ చిరాకు ఈ మధ్యకాలంలో వచ్చిందే గాని, మొదట్నుంచీ ఉన్నది కాదు. వంకాయలు ఏ అర్ధ రూపాయి కమ్మే రోజుల్లో రెండు రోజులకు కావలసిన కూరలు ఓ రూపాయి పెట్టి తెచ్చేవాడిని. ఇక ఊరు వదిలి ఏ చోడవరమో, పాడేరు పల్లో వెళ్ళినప్పుడు ఆ ఊరి సంత ఎప్పుడో కనుక్కొని సరదాగా సంత కెళ్ళేవాడిని. అటువంటిది ఇప్పు డీ అయిష్టం కలగడానికి కారణాలు లేకపోలేదు. నాలుగు రూపాయలు పట్టుకెళ్ళినా రెండు రోజులకు సరిపడే కూరకూడా రాదు. ఇక బేరమాడ్డానికి నోరు విప్పామా—'వెళ్ళు, బాబూ, బేరమాడే రోజులు పోనాయి' అనో, మరి కాస్త నోటి దురుసుది అయితే 'ఇలాగే కొంటున్నా వేటి' అనో, 'కొనే మొగమేనేటి' అనో అనటం సామాన్యమై పోయింది. అది ఇదీ కాకుండా మనిషిని చూసే కొనేవేలా లేదని తేల్చేసి ముఖం పక్కకు తిప్పుకుని హోటల్ బేరాలు చూస్తారు. సాధారణంగా హోటళ్ళకు కూరలు కొనేవారు బేరాలాడర్రు. ఒకవేళ ఆడినా ఏవుంటే అవి ఎంపుడు చేయకుండానే ఓ పదో, పదిహేనో కేజీలు పట్టుకు పోతారు.

ఇటువంటి పరిస్థితుల్లో మధ్యతరగతి కుటుంబీకుడు ఓ అరగంటో, గంటో కాలం వృథా చేసి మార్కెట్టుకు పోయి కూర తెచ్చుకోవడం కన్నా ఇంటికొచ్చే కూరలమ్మి దగ్గర కొనుక్కుంటే నయం. మహా అయితే ఓ పదో, పదిహేనో పైసలు తేడా ఉంటుంది.

ఈ కారణాల వల్లే మార్కెట్టు ఎగవేయడం నేర్చుకున్నాను.

రోజూ ఈ వెధవ వంకాయలు, బీర కాయలేనా, ఏదైనా మంచి కూర ఉంటే తెద్దురూ అని సత్య పది సార్లు చెబితే ఎటూ ఆదివారమే గదా అని బయలు దేరాను.

కొంచెం ముందుకు వెళ్ళానో లేదో అక్కడేదో ఉపద్రవం జరిగిందని ఊహించ గలిగాను.



అయినా, ఈ పట్నాల్లో ప్రతిదీ వింతే. అందులో విశాఖపట్నంలాంటి కాస్మోపాలిటన్ సిటీలో మరీను. ఏ ఫారిన్ షిప్పో వచ్చి ఫారినర్సు నలుగురు వీథిని పడ్డారా, ఓ పది మంది అడుక్కునే వాళ్ళూ, ఓ పది మంది రిక్షా వాళ్ళూ, మరో పది మంది వాళ్ళ వేషాల్నీ, వాలకాల్నీ చూసే వారూ చుట్టూ మూగుతారు. లేదా బొంబాయి ఫుట్‌పాత్‌ల మీదినుంచి దిగుమతయిన ఏ నటుడో రూపాయకు గుండుసూదితో సహా పది వస్తువులని మైకు పట్టుకుని అమ్ముతూంటే, అక్కర లేకపోయినా చుట్టూ చేరి నలుగురూ నాలుగు చేతులు వేస్తే గాని ఊరుకోరు.

ఇక్కడి జనాన్నెలా ఆకట్టుకోవాలో చాలామంది వ్యాపారస్థులకు తెలుసు. కానీ, ఇవేవీ కావని నేను తెలుసుకోవటానికి అట్టేసేపు పట్టలేదు. మార్కెట్టు లోంచే జనం విపరీతంగా వస్తున్నారు. దానితోబాటు రోడ్డుమీద పోయే జనం కూడా ఆగి వింతగా చూస్తున్నారు. ఈ సందడికి స్టాపులో ఆగవలసిన నాలుగు సిటీ బస్సులు దూరంగానే ఆగిపోయాయి. వాటి వెనక కార్లూ, రిక్షాలూ, ఆటోలూ.

పదేళ్ళ బట్టీ అదే ఊళ్ళో ఉంటున్నానేమో నాకూ అంటింది. ఈ వింతేదో కనుక్కోందీ మార్కెట్టులోకి వెళ్ళ బుద్ధి కాలేదు నాకు. మార్కెట్టుకి రెండో వైపున్న అవకతవకల ఫుట్‌పాత్ మీద నిలుచుని మార్కెట్టు లోపలికి చూడ్డానికి ప్రయత్నించాను.

ఇంతలో లోపల్నించి ఏడుపులూ, పెడబొబ్బలూ వినిపించాయి. చూస్తున్న జనాన్ని తోసుకుంటూ ఓ గుంపు బయట పడింది. ఆ గుంపు వెనకాల దృశ్యం నన్నాశ్చర్యపరిచింది. పదిమంది కలిసి ఓ నులకమంచాన్ని మోసుకొస్తున్నారు. ఆ మంచం మీద ఓ మానవాకారం పడుకుని గిలగిల కొట్టుకుంటూంది. ఆ ఆకారం స్త్రీదని గుర్తించడానికి ఆట్టేసేపు పట్టలేదు. ఆమె కట్టుకున్న తెల్లని వస్త్రం నిండా పెద్ద పెద్ద రక్తపుమరకలు. చూసేవారికి కళ్ళు చెదరగొట్టే దృశ్యమది. అంత వరకూ నిశ్శబ్దంగా ఉన్న గుంపులోంచి కలకలం బయలుదేరింది. ప్రతి ఒక్కరి మనసుల్లోనూ ప్రశ్నలే; సందేహాలే.

'ఏమిటోయ్, ఏం జరిగింది?' ఓ పెద్దమనిషి ఓ రిక్షావాడిని అడుగుతున్నాడు. ఆ క్షణాన ఎవ రేం చెబుతారో నని అందరికీ ఆత్రతే. అక్కడో పది మంది చెవులు రిక్కించారు రిక్షా వాడి వైపు.

'ఆడమనిషి, బాబూ. . . కూర్లమ్ముకునే మనిషి. జగడ మాడుకున్నార్లా ఉంది. నెత్తు రొచ్చేట్టు కొట్టుకున్నారు. ఆస్పత్రికి గావాల తీసుకెల్తన్నారు.'

కొందరి కా సమాధానం సంతృప్తి నివ్వలేకపోయింది. ఎవరి మట్టుకు వారు మరో వ్యక్తి నడగడానికి ప్రయత్నిస్తున్నారు.

'ఏక్సిడెంటా? అబ్బే, అలా నరుకేడ ఉన్నాదేటి?' పళ్ళ దుకాణం వాడి నడిగా డో లాల్చీవాలా.

వాడేం వినిపించుకున్నట్టు లేదు. పక్కనున్న రొట్టెలకొట్టువాడితో అరవంలో ఏదో మాట్లాడుతున్నాడు. లాల్చీవాలా విసుక్కుని మరో మూటువాలాని అడిగాడు—'ఏమిటండీ అసలు సంగతి' అని మర్యాదగా.

## ఆదూరి వెంకట సీతారామమూర్తి

'నేనూ ఇప్పుడే వస్తున్నానండీ, బాబూ. మా రిక్షావాడు ఇక్కడ ఆపేసి చూడ్డానికి పోయాడు'. రిక్షా తనదే నన్నంత ధీమాగా ఓ కా లందులో వేసి విసుక్కున్నాడు మూటువాలా.

ఇందాకటి పెద్దమనిషి జనాన్ని తోసుకుని ఫుట్‌పాత్ ఎక్కి, 'ఏమిటో! ఎవర్నడిగినా చెప్పటం లేదు. మీ కేమైనా తెలుసునేమిటి?' అన్నాడు లాల్చీవాలాతో. లాల్చీవాలా ఓ నిట్టూర్పు లాంటిది విడిచి అరంగుళం కుంగిపోయి, 'తెలిస్తే ఇక్కడెందుకుంటా నండీ? కనబడ్డ వాళ్ళందరికీ చెప్పుకుంటూ ఇంటికే పోదును' అన్నాడు.



ఇద్దరిలోనూ అసంతృప్తి తాండవించడం గమనించాను. నా మట్టుకు నాకు లేదూ? వాళ్ళలా నోరు తెరిచి అడగలేదు గాని, ఎవరి నోటంట ఏ మాట వొస్తుందో నని చెవులు రిక్కించి యుద్ధ సమయంలో వార్తల్లా వింటూనే ఉన్నాను. కాకపోతే కాస్త డిగ్నిఫైడ్‌గా—అంతే!

'మరేన్లేదండి బాబూ, మామూలు కతే.' నోట్లో ఉన్న బీడీముక్క పారేసి గళ్ళులుంగీని మగానికి మడిచి కట్టుకుని వచ్చా డో వ్యక్తి. రాత్రంతా పూటుగా తాగేసి ఫుట్‌పాత్‌మీదే దొర్లినట్టుంది వాలకం. బనీను బాగా మాసిపోయింది. ముఖం ఇంకా తెప్పరిల్లుకున్నట్టు లేదు. మరొకప్పుడైతే అటువంటి వాడి వైపు మాసేవాడే కాదేమో? కానీ, ఇప్పుడు మాత్రం అతడు చెప్పే దానిమీద కుతూహలం కనబరిచి దగ్గరగా జరిగా డో పెద్దమనిషి. లాల్చీవాలా కాస్త సహాయంపుగానే 'ఏటయ్యా అది' అన్నాడు.

'ఏముందు, బాబూ. దాని బావ దాన్ని పొడిచేశాడు.'

'ఏమిటీ!' అన్నా రంతా ఏకకంఠంతో.

'రాతిరంతా తాగి ఇల్లు చేరలేదంట. అదేమని అడిగితే కాయగూరలు కోసుకునే కత్తితో పొడిచేసినాడంట.' అతి మామూలు విషయం చెప్పినట్లు చెప్పి మరో బీడీ అంటించుకుందుకు కాబోలు వెళ్ళిపోయాడు గళ్ళులుంగీ.

'హమ్మ, వీడి దుంపతెగ! వీడి ధైర్యమూ వీడూను.' ఎప్పు డొచ్చాడో మధ్యకి ఓ గాలవళ్ళ పురోహితుడు సైకిల్ స్టాండేసి మంత్రాలు వల్లించినంత జోరుగా ఆశ్చర్య పోయాడు.

'కలికాలమండీ, కలికాలం. తెల్లార్లేచి పేపర్లో ఎన్ని చదవటం లేదు? ఆకలికి తట్టుకోలేక పూటుగా తాగొచ్చి పెళ్ళాన్ని, పిల్లల్ని పొడిచిన వాడొకడైతే, తను లేనప్పుడు పెళ్ళాం ఎవడితోనో కులుకుతూం దన్న అనుమానంతో పెళ్ళాన్ని చంపి-తను నూతిలోకి దూకినవాడొకడు.'

"సహజమైన చావు లేదండీ, బాబూ. ఆకలితో కొందరు, అనుమానాలతో కొందరు, తాగి కొందరు, తాగక కొందరు, ఆడదాని కోసం కొందరు, డబ్బు కోసం మరికొందరు, ఒకటేమిటి? జంతువుల కోసంకూడా మనుషులు ఒకర్నొకరు చంపుకుంటున్నారు."

"పూర్వం రోమ్‌లో మనుషుల మీదికి క్రూరమృగాల్ని వంపి, అవి వాళ్ళని చంపుతూంటే చూస్తూ ఆనందించే వారట అప్పటి రాజులు. ఇప్పుడు ప్రతి వాడూ

# స్మృతి చిహ్నం

డా॥ సి. నారాయణ రెడ్డి

ఒకప్పుడు పోయింది ఒకప్పుడు వెంటేగుంటుంది
ఈ లోకం విలయానికి ఎదురు చూస్తున్నట్టుంది.
చిరిగిన నా అంగీని ఎవరికి చూపించేది
పరమాత్మని చంపే చిరిగి పేలికలైనట్టుంది
తన నేర్పే పుట్టి పెరిగిన మురిపెం సృష్టిని చూసి
పాపం, ఆ సృష్టికర్తే చూపు దించుకున్నట్టుంది
తనువు మేల్కొని ఉంది మనసు నిద్రిస్తూ ఉంది
బుద్ధి భూతకాలానికి స్మృతి చిహ్నమున్నట్టుంది
ఎవరిని పిలిచినా శిథిలాలు బదులు పలికినట్టుంది
ఏ ముఖాన్ని చూసినా గతానికి ప్రకటన ఉన్నట్టుంది
మరుభూమిలోనే గుంకాలా మాయదారి పొద్దు!
ఇక్కడ ఏ సమాధి చూసినా నా సమాధి ఉన్నట్టుంది.
వడ్డీ చెల్లించే దెవరు? జామీను నిలిచే దెవరు?
ఈ విప్లవం ఏ నాటికీ తీరని ఋణం ఉన్నట్టుంది.
ఆర్పేయండి ఈ దీపాన్ని అప్పుడైనా తెల్లవారుతుంది
రాత్రంతా ఇది సంతాపసభ చేస్తూ ఉన్నట్టుంది. ★

(కైఫీ ఆజమి ఉర్దూ కవితకు అనుసృజనం)

రాజేగా—సగం చంపి, 'ఎలా ఉన్నావు' అని అడిగి, ఒక్కసారి చంపకుండా దఫదఫాలుగా చంపడం నేర్చుకున్నాడు."

పెద్దమనిషి ఇదే అదనని తన విజ్ఞానాన్ని ప్రదర్శించాడు.

"చంపడంలోకూడా వేర్పుంటుందండి, బాబూ. ఆ మధ్య ఒకడు ఒకణ్ణి చంపి పది భాగాలు చేసి పది పెట్టెల్లో పెట్టి, పది చోట్ల విడిచి పెట్టాడట. దీనికంతా కారణం ఏమిటంటారు? కసి." అందుకున్నాడు మరొకడు.

'అయినా, మన ప్రభుత్వానిది బుద్ధి తక్కువండి. ప్రజల కిన్ని అవసరాలు ఉండగా తాగండ్రా అని ఈ ప్రొహిబిషన్ ఎత్తేయడ మేమిటి, చెప్పండి? అలవాటు లేని ప్రతి వెధవా తాగి తందనా లాడి ఇలాటి దేదో చేయడం, మత్తు దిగాక మొత్తుకోవడం, జైళ్ళలో కూలబడడం.'

పంతులు రాజకీయాల్లోకి దిగాడు.

"అయినా,ఏమి తాగిందిరా! తెంటుగా?" సవరించా డో కుర్రకారు.

"ఎప్పుడో తాగినవాడికి రాత్రేమిటి, పగలేమిటి? తాగి తద్దినాలు పెట్టే వాళ్ళుకూడా ఉన్నారు" అని టైమ్ చూసుకుని సైకిలెక్కి చక్కా పోయాడు పంతులు.

నా బుర్ర వేడెక్కిపోయింది. ఎవరు చెప్పింది వినాలో, ఎవరు చెప్పింది కాదనాలో ఆలోచించే స్థితిలో లేను.

పైన ఎండ చుర్రుమంటూంది. నా కళ్ళలో రక్తం చీరలో కొట్టుకుంటున్న ఆ స్త్రీయే మెదులుతూంది. ఏది ఏమైనా బాధ బాధే. చంపినవాడు ఒక్క పోటుతో చంపినా బాగుండేది. చచ్చే వరకూ ఆ నరకయాతన అనుభవించ వద్దూ? పాపం!

బయలుదేరక బయలుదేరక నేను బయలుదేరటం వల్లనే ఈ ఘోరం జరిగిందా అనిపించింది.

రోడ్డుమీద జనం తగ్గుముఖం పట్టారు. వెంటనే మార్కెట్టులోకి పోతే ఇంకెటువంటి సంఘటన చూడవలసి వస్తుందో నన్న భయంకూడా నన్నావహించింది.

కాస్త కాఫీ తాగి తరవాత నెమ్మదిగా వెళ్ళవచ్చునుకుని దగ్గరున్న హోటల్లోకి దూరాను. కాఫీ తాగుతున్నంత సేపూ ఆ విషయమై నా మెదడు ఎంత వద్దనుకున్నా ఆలోచిస్తూనే ఉంది.

రెండు రోజులకు సరిపడా కూరలు కొందామని బయలుదేరిన వాడిని ఏదో ఓ కూర కొని ఇంటి దారి పట్టాలనుకునే ఉద్దేశంతో కొచ్చి మార్కెట్టులోకి అడుగు పెట్టాను.

మార్కెట్టు మళ్ళీ మామూలుగా తయారౌతూంది.

కూరలమ్మే వాళ్ళు మాత్రం ఆడా మగా పెద్దగా వాళ్ళ భాషలో మాట్లాడుకుంటున్నారు.నాలుగుసార్లు అరిచిఛరెంతో కనుక్కుని, కాసేపే తూపించే సరికి నా తం ప్రాణం తోక్కి వచ్చింది.

"ఏమైతే అయింది! ఈ సారి కాయితం మీద రాసి నలుగురూ సంతకాలేసి పంపిద్దాం. ఇయ్యాలొక రైతే, రేపు మరో పది మంది దొరతారు."

"అయినా, మున్సిపాలిటీ వా ఏటి చేస్తాది—కంట్రాక్టు బొమ్మదిదాయె—పైగా తక్కువ టెండరి!"

"ఓటి మేటో ఆడ్దాం. అదుగు మీరంచి దుకాణం కాస్త కిందికి జరిపితే డబ్బు రోజూలు చేస్తారా, మరి మన బాగు ఎవళ్ళేటి? ఓ మూల అనుట్లా, గేదెలా సరుకులు తినేస్తాం ఓ, మరో మూల యిలాట్టా దర్శు పెంచేస్తుంటే మందేటి తప్పు? ఆ నష్టం ఎవ్వ రెట్టుకుంటాడు? పైగా ఇప్పుడీ పేణబయి మోటి!"...

ఈ మాటు నా నోరు ఊరుకోలేదు.

డబ్బు లిచ్చి కదిలి రాబోయిన వాడినల్లా వాళ్ళ మాటలు అర్థంకాక అక్కడే నిలుచుండి, "ఏమైంది" అన్నాను ఆతడితోనే.

"ఏటండి, బాబా! నిండు పేణం పోను. ఆ తల్లి ఏ మొకం చూసిందో గానీ ఈరోజు —గోడ విరగబడిపోయింది. ఏ గోడ ఎవరి మీద పడుద్దోనని ఇక ఇదో బయం."

నిశ్చేష్టుడి నయ్యాను నేను.

నా మెదడులో దూరిన కట్టుకథ ఛాయలు పూర్తిగా పోవాలంటే మరి కొంత టైమ్ కావాలి నాకు.

విషయం పూర్తిగా తెలుసుకోకుండా లోనికి అడుగు పెట్టకుండానే వెళ్ళిపోయి ఉంటే నేను ఏన్ని రూమర్ ఎందరితో చెప్పేవాడినో ఆలోచిస్తే తల తిరిగినట్లయింది. ★



స్వేచ్ఛా విహారం ఫొటో—ఆర్. సుధాకరరెడ్డి (ప్రా. ఎ. 23)